
కథ

# సున్నా శాతం స్కూలు!



## పెద్దిభొట్ల సుబ్బరామయ్య

ముందుగా భయపడ్డంత దూరం ఏమీ కాదు, కేవలం రెండు గంటల ప్రయాణం. కాకపోతే బస్సుమాత్రం ఈ మే నెల నాటి భారతదేశం వలె కిటకిటలాడుతూ ఉండటం కొంచెం కష్టమనిపించింది. తీరా బస్సు దిగి చూద్దును కదా, స్కూలు ఊరి బయట దూరంగా ఉంటుందన్నారు. కనబడిన పాక హోటల్లో కాసిని కాఫీనీళ్లు గొంతులో పోసుకుని హుషారుగా నడిచి ఊరు దాటి స్కూలు ముందుకు వచ్చి నిలబడ్డాను.

స్కూలు మంచి షేపులోనే ఉంది. పాతబడినదే అయినా ఒక ముఖద్వారం, చుట్టూ ఇంగ్లీషు తుమ్మల హద్దు, లోపల ఒకమోస్తరు పాకలు ఇదీ స్కూలు పరిస్థితి. వాలకం చూస్తే లోపల ఏమీ కలకలం ఉన్నట్టు లేదు.

లోపలికి వెళ్లి హెచ్.ఎం. అని చిన్న బోర్డు ముందు ఆగి లోపలికి చూశాను. అవతల నుంచి ప్యూను అనుకుంటాను ఒకడు నా వంక కళ్లెగరేసి 'ఏమిటన్న'ట్టు చూశాడు. ఆ తర్వాత నేను అతని సమ్మతి లేకుండానే లోపలికి అడుగుపెట్టాను. ప్యూను వెళ్లిపోయాడు.

హెచ్.ఎం. నావంక పరీక్షగా చూసి "మీరు ... నువ్వు ... వినాయకరావు కదూ?" అని పలకరించాడు.

నేనూ అతన్ని గుర్తుపట్టాను. తులసీదాసు ... ఎప్పుడో ముప్ఫయి ఏళ్ల క్రిందట గుంటూరులో ఒకే కాలేజీలో ఇంటర్ వెలగబెట్టాం ఇద్దరమూ. అంతమందిలోనూ ఆనాడు మేమిద్దరం కలిసి మెలిసి ఉండటం చూసి అందరూ మమ్మల్ని 'కరటక దమనకు'లని సరదాగా వ్యవహరిస్తూ ఉండేవాళ్లు. నాకు ఇప్పుడతన్ని చూస్తే ముఖ్యంగా అక్కడ ఆ పొజిషన్లో చూస్తే అమితానందం కలిగింది.

నవ్వుతూ, "ఊరికే వచ్చాను, సరదాగా! ఈ స్కూలు చూసిపోదామని, అంతే!" అన్నాను.

"కూర్చో... కూర్చో! చాలా ఏళ్లకు తగిలావు, నిన్నొదిలిపెట్టను!" అని, తర్వాత "ఏం చేస్తున్నావు? ఎక్కడుంటున్నావు?" వంటి ప్రశ్నలు సంధించాడు.

అన్నింటికీ సమాధానాలు చెప్పాను.

"ఊఁ, బాగుంది. ఇప్పుడో, కాస్సేపటిలోనో మినిస్టరు గారొకాయన ఆకస్మిక తనిఖీకి వస్తున్నారు. ఆ తంతు పూర్తి అయ్యాక మా ఇంటికి పోదాం!"

"ఆకస్మిక తనిఖీకి వస్తుంటే ఆ విషయం నీ కెట్లా తెలిసింది?" అని అడిగాను ఆశ్చర్యపోతూ.

అతను నన్నొక వెర్రివాణ్ణి చూసినట్టు చూసి, "అదంతేలే ... వెయిట్ అండ్ సీ!" అన్నాడు.

"మరి ... స్కూలులో పిల్లలేరీ? క్లాసులు లేవా?" అని అడిగాను.

"లేకేం? నిక్షేపంగా ఉన్నాయి!" అన్నాడు.

"అందర్నీ నిన్నటినుంచి ఇళ్లల్లో, రోడ్డువక్కనా, పొలాల్లో, పక్కవాళ్ల పొలాల్లో, ఇళ్లల్లో ఇంకుడుగుంటలు తవ్వమని పంపించేశాను. అయినా పదోక్లాసు ఎలాగూ లేదిప్పుడు ... మిగిలిన వెధవలు అందరూ కలిసి వందమంది ఉంటారంతే! ఆడపిల్లలు ఒక పాతికమంది ... వాళ్లెట్లాగూ రావడంలేదు!"

"మరి టీచర్లు?"

"ఉన్నారున్నారు. వస్తూ ఉంటారీపాటికి. మంత్రిగారి ఆకస్మిక తనిఖీ ఉందని కబురు పెట్టానందరికీ."

అంతలో ముగ్గురు నలుగురు మహాట్టహాసంగా గోలాపాలంగా గదిలోపలికి వచ్చి హెచ్.ఎం.గారికి సవినయంగా సందడిగా నమస్కారాలు చేశారు.

తులసీదాసు వాళ్లందర్నీ పేరుపేరునా పరిచయం చేశాడు. "వీరు విష్ణురావు, ఎం.ఎస్.సి., పక్కపట్నంలో ఉంటూ ఉంటారు. రోజంతా చిట్‌ఫండ్‌లు, ఉదయం, సాయంకాలం ట్యూషన్లు. వీరు భగవంతంగారు ... బి.ఏ.బి.ఇడి. సోషల్. వీరు షేర్ మార్కెట్ వ్యవహారాల్లో నిష్ణాతులు. ఇక వీరు నందివర్ధనరావుగారు ... భీమా బకాసుర బిరుదాంకితులు. వీరు కవి వృకోదర వీరభద్రయ్యగారు ... వీరి కవితలు చదివే ఉంటావు ... ఇక ఈవిడ ..." అంటూ ఉండగా ఆమె తనంతట తనే, "నా పేరు శ్రీదేవి. మా వారు ఎం.ఎల్.ఏ.గారికి పి.ఏ." అని పరిచయం చేసుకుంది.

"బాగుంది బాగుంది!" అన్నాను నేను.

అంతలో బయట కోలాహలం. అమిత సందడి. అందరం ఇవతలికి వచ్చాము. హెచ్.ఎం.తోపాటు మిగిలిన టీచర్లు గేటు దగ్గరకి పరుగుపరుగున వెళ్లారు. గేటు పక్కన చెట్టు చాటున ఉంచిన బుట్టలో నుంచి పూలదండలు ఇవతలికి తీసి నిలబడ్డారందరూ. రివ్వురివ్వున ధ్వని చేసుకుంటూ దుమ్ము లేపుకుంటూ కొన్ని కార్లు వచ్చాయి. వెనుక ఆగిన కార్లలోనుంచి సాయుధులైన అంగరక్షకులు దిగి పరుగులు పెట్టుకుంటూ ముందుకు వచ్చారు. మంత్రిగారు రెండో కారులో ఉన్నారో, మూడో కారులో ఉన్నారో తెలియక కొన్ని క్షణాలు గందరగోళం నెలకొన్నది. చివరకు మూడో కారులో నుంచి మంత్రిగారు ప్రత్యేక రంగు చొక్కా, పంచె, పైపంచెలతో నల్ల కళ్లజోడుతో దిగివచ్చారు. ఆ వెనుక నుంచి బుల్లితెర ప్రైవేటు ఛానళ్లవారు దిగి అప్పటికప్పుడే కెమెరాలు సారించారు. ముఖద్వారం దగ్గర స్వాగత సత్కారాలందుకున్న వెంటనే మంత్రిగారు అందర్నీ వదిలి పక్కకు నాలుగడుగులు వేసి ఒకచోట ఆగి భ్రుకుటి ముడివేసి కళ్లజోడు తీసి, "ఏమిటిది?" అని గర్జించారు.

హెచ్.ఎం. "ఏమిటిది?" అని ప్యూన్‌ని చూసి గర్జించాడు. ప్యూన్ నీళ్లు నములుతూ

"చిత్తం! జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఇంకుడుగుంటలు శక్తికొద్దీ ఎక్కడపడితే అక్కడ తవ్వమనీ, అదయిన తర్వాత వీధుల్లో చెత్తాచెదరమూ ఊడ్చిపారబోయమనీ మేమే చెప్పి తోలేశామండీ!



"బహుశా ... పక్కఇళ్లవాళ్లు ... మనమంటే గిట్టని ఎగస్పార్టీ వాళ్లు వాళ్ల పిల్లలను కూర్చోబెట్టి ఉంటారండీ...!" అంటున్నాడు.

మంత్రిగారు టీవీ కెమెరావైపు గంభీరంగా చూసి, "ఇట్లా అయితే ఊరుకోను, జాగ్రత్త! కఠినమైన యాక్షన్ తీసుకోవలసి ఉంటుంది. అది సస్పెన్షన్ అయినా కావచ్చు, ట్రాన్స్‌ఫర్ అయినా కావచ్చు! ఒళ్లు దగ్గరపెట్టుకుని ఉండండి అందరూ!" అన్నాడు. ఆ తర్వాత దండధరులై ముందుకు నడిచారు. ఆయన వెంట బలగమూ నడిచింది.

వరండాలో పర్యవేక్షణ జరుగుతూ ఉండగా రెండు మూడు గదుల్లో మాత్రమే అయిదారుగురికి మించి విద్యార్థులు లేకపోవడం గమనించి, మంత్రిగారు "మరి స్కూల్లో క్లాసులు జరగటంలేదా?" అని అడిగారు.

"చిత్తం! జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఇంకుడుగుంటలు శక్తికొద్దీ ఎక్కడపడితే అక్కడ తవ్వమనీ, అదయిన తర్వాత వీధుల్లో చెత్తాచెదరమూ ఊడ్చిపారబోయమనీ మేమే చెప్పి తోలేశామండీ! ఈపాటికి వాళ్లంతా ఆ పనిమీదనే ఉండి ఉంటారండి. వాళ్లవెంట ముగ్గురు టీచర్లు కూడా ఉన్నారండి ... పని పర్యవేక్షణ చేస్తూ. మిగిలిన టీచర్లు ఇక్కడే ఉన్నారండీ!" అని వివరించాడు హెచ్.ఎం. ఆ తర్వాత టీచర్ల రిజిస్టర్ ఒక్కసారి తిప్పి చూసి మంత్రిగారు సంతృప్తి చెందినవార్రై టీవీ కెమెరాల కెదురుగా నిలబడి టీచర్లను, హెచ్.ఎం.ను ఉద్దేశించి రెండు నిమిషాలే అయినా గంభీరంగా ఉపన్యసించారు. స్థానికులు కూడా కొందరక్కడ చేరి మంత్రిగారికీ, రాజధాని నగరంలో ఉండే పార్టీ ప్రముఖులకూ జయజయధ్వానాలు చేశారు. మంత్రిగారు సపరివారంగా మళ్లీ వెనుదిరిగిపోయారు. కార్లు కదిలిపోవడంతో అంత కోలాహలమూ ఒక్కసారిగా సద్దుమణిగింది.

"హమ్మయ్య!" అనుకుంటూ కూర్చున్నాడు హెచ్.ఎం.

టీచర్లు కూడా "హమ్మయ్య!" అనుకుంటూ కూర్చుని సంతోషంగా ముఖాలు పెట్టి మాట్లాడుకుంటున్నారు.

డ్రింకులు వచ్చాయి. ప్యూన్ అందరికీ అందిస్తూంటే, "నా కొద్దు బాబూ! చల్లని డ్రింకు జలుబు చేస్తుంది!" అంటూ చెయ్యి అడ్డంగా ఊపింది శ్రీదేవి. అందరూ తమకేవేవో అర్జంటు పనులున్నాయని చెప్పి ఒకరి వెంట ఒకరుగా వెళ్లిపోయారు.

హెచ్.ఎం. బల్లమీద తన ముందున్న రకరకాల రిజిస్టర్లు విసిరి అవతల పడేశాడు విసుగుతో. "అవన్నీ రాత్రల్లా చచ్చినట్టు తయారుచేశాము మేము నలుగురం కూర్చుని ... చూడనే లేదు మహానుభావుడు!" అన్నాడు.

అప్పుడు వచ్చాడాయన. తళతళలాడే సిల్కు చొక్కా, గ్లాస్కో పంచె, వ్రేళ్లకు లావుపాటి ఉంగరాలు ... మెడలో పులిగోరుతో పెద్ద గొలుసు... చాలా ఆర్భాటంగా ఉన్నాడు. పెద్ద గొంతుకతో వచ్చీ రావడంతోనే "మంత్రిగారిని సాగనంపి వచ్చా!



ఐసయిపోయినాడులే! మళ్లీ ఇప్పట్లో ఇటేపు సూడ్డు!" అన్నాడు కుర్చీ పట్టకుండా ఒదిగి ఒదిగి కూర్చుంటూ.

తులసీదాసు నన్నాయనకు పరిచయం చేసి ఆయన ఎవరో నాకు చెప్పనే లేదు. నేనే చొరవ తీసుకుని "వారిని పరిచయం చెయ్యనేలేదు!" అన్నాను. ఆ వ్యక్తి అందుకు అనవసరంగా ఫెళ్లున నవ్వి, "నేనా... నే నీడ ... ఈ ఊళ్లో ... ఏం జెప్పాలబ్బా...?" అంటూ ఆగి, ఇంకొంచెం పెద్దగా నవ్వుతూ, "సర్పంచ్‌గారి మొగుణ్ణి అని అనుకోండి...!" అన్నాడు. మరింత పెద్దగా నవ్వాడు.

ఆ తర్వాత మరో రెండు మూడు నిమిషాలే కూర్చుని మాటి మాటికీ పైకప్పు ఎగిరిపోయేలా నవ్వుతూ గడిపి, తర్వాత "ఎల్లొస్తా ... మళ్లీ కలుస్తా!" అంటూ వెళ్లిపోయాడు. అతనివెంట అతని అంగరక్షకులిద్దరు, కండలు తిరిగిన వస్తాదులవంటివారు కూడా కదలిపోయారు.

"అది సరే ..." అని మొదలుపెట్టాను నేను.

"రెండు సంవత్సరాలుగా వరుసగా ... ఈ స్కూలు పదవతరగతి స్టూడెంట్స్ అందరూ, ఏమాత్రమూ మినహాయింపు లేకుండా తప్పుతున్నారుట పబ్లిక్ పరీక్షల్లో ... మా ఎడిటర్‌గారు ఒకసారి చూసిరమ్మంటే వచ్చాను నేను. సున్నాశాతం స్కూళ్లెన్నో ఉన్నాయట .... అందులో ఇదొకటి అంటున్నారు...!"

"అదే ... అదే చెప్పబోతున్నాను నేను కూడా. పోయిన సంవత్సరం, క్రితం సంవత్సరం మొత్తం అందరూ తప్పారు. మొదటిసారి ముప్ఫయిమంది, క్రితం సంవత్సరం ముప్పైరెండుమందీ పబ్లిక్ పరీక్షలు రాసి మొత్తం ఏకంగా ఫెయిలయినారు. ఈ సంవత్సరం ముప్పైఏ ఒక్కమంది. అందులో ఆడపిల్లలు అయిదుగురు. పరీక్షలు రాస్తే ఇద్దరూ పాసయినారు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి.

వాళ్లెందుకు ఎట్లా పాసయినారో తెలియడం లేదు. కబురు వెళ్లింది. రావాలి కాస్సేపటిలో ... నిజానికి నేను ఈసారి కూడా మొత్తం అందరూ తప్పితే ఈ విషయంలో హ్యాట్రిక్ సాధించి ఏకంగా ప్రపంచ రికార్డు నెలకొల్పుదామని ఆశపడ్డాను. ఈ ఇద్దరు కుంకలూ నా ఆశమీద నీళ్లు చల్లేశారు!" అంటూ కణతలు పట్టుకున్నాడు హెచ్.ఎం.

అంతలో ప్యూన్ కూడా హడావుడిగా వచ్చి, "వచ్చారు సార్!" అన్నాడు పెద్దగా.

"ఇడుగో, రోశయ్య, ఈయన ఏసురత్నం!" అంటూ ఇద్దరు నడివయసు వ్యక్తులను చూపించాడు. వారిద్దరూ దణ్ణాలు పెడుతూ లోపలికి వచ్చి ఒదిగి ఒదిగి గోడకానుకుని నిలబడ్డారు. వారివెంట ఒక పదిహేనేళ్ల నల్లని అమ్మాయి పెద్దపెద్ద తెల్లని కళ్లతో చుట్టూ భయంభయంగా చూస్తూను, మరో పదహారేళ్ల కుర్రవాడు జుట్టు వెనక్కి నెట్టుకుంటూను లోపలికి వచ్చి నిలబడ్డారు.

"ఏమయ్యా... ఏం చేస్తూంటావు నువ్వు?"

"తాపీ పని సార్. ఊళ్లు తిరుగుతుంటాను." అన్నాడతడు.

"మీ అమ్మాయి పాసయింది."

"సంతోషం, సార్! మా ఆవిడ ఇంటర్ చదువుకుందయ్యా. తర్వాత మా పెళ్లి అయినంక సదువు మానేసింది. అదే కాస్త ఇంటికాడ కూలేసి సదివించింది సార్!" అన్నాడు ఏసురత్నం. "అవును, సదుంకొన్నాను..." అన్నది పిల్ల మెల్లిగా.

"సర్లే... సర్లే...!" అని విసుక్కున్నాడు హెచ్.ఎం.

"నువ్వు? నువ్వేం చేస్తుంటావు?" అని అడిగాడు మరో వ్యక్తిని.

"నా పేరు రోశయ్యండి. పక్కూళ్లో పొలం కౌలుకు చేస్తూంటానండీ!" అన్నాడతను.

హెచ్.ఎం. కుర్రవాడి వంక తిరిగి, "ఏరా వెధవా! ఎప్పుడూ స్కూలుకు రాకుండా తిరుగుతుండేవాడివి కదా, నువ్వెట్లా పాసైనావురా?" అని అడిగాడు.

"మరి హాజరు సంగతి?" అన్నాను మధ్యలో నేను.

"సరే... సరే ... అదే అడిగావూ? అదంతా మేము మేనేజ్ చెయ్యడమేగా?" అంటూ, "చెప్పు ... ఎలా పాసయినావు?" అని అడిగాడు కుర్రవాణ్ణి హెచ్.ఎం.

వాడు ముందు సందేహించినా, నీళ్లు నమిలినా చివరకు కొంచెం దబాయించేసరికి నిజం బయటపెట్టాడు. లెక్కల్లోనూ, సైన్సులోనూ వాడికి ఓ అంటే న రాదు. మిగిలినవి ఫర్వాలేదుట. ఆ రెండు సబ్జెక్టులను గురించీ అమిత శ్రద్ధ వహించి పరీక్ష జ్వరతీవ్రత మితిమీరి అద్భుతమైన ప్రజ్ఞతో కాపీలు తయారుచేసుకుని అంతకన్నా నైపుణ్యం చూపి హాల్లో తన పని కానిచ్చుకున్నాడు.

నేను ఆశ్చర్యపోయి, "మరి వాచర్లు చూడలేదా, పట్టుకోలేదా?" అని అడిగాను.

వాడు చిత్రంగా చూస్తూ, "వాళ్లసలు రూములో ఉంటే కదండీ ... వరండాలో పేపరు చదువుకుంటూ కూర్చున్నారండీ పరీక్ష జరుగుతున్నంతసేపూ ..." అన్నాడు.

"మరి మిగిలిన స్టూడెంట్స్ అట్లాంటి పనికి పూనుకోలేదా?" అని అడిగాను నేను.

"అప్పటికీ నేను కొందరికి చెప్పానండీ, ఆళ్లు ఇనలేదండీ... ఆళ్ల అంతరాత్మలు అట్టాంటి తప్పుడు పనులు సెయ్యడాని కొప్పుకోలేదన్నారండీ!"

"సరే... సరే! వచ్చేవారం రండి, మార్కులొస్తాయి!" అన్నాడు హెచ్.ఎం.

వాళ్లు వెళ్లిపోయారు.

బయట గాలి బిగించింది. ప్యూను బయట గోడపక్కన ఘుట్కా నములుతూ కూర్చుని ఉన్నాడు. ఎక్కడో ఏదో పేరు తెలియని పక్షి వికృతంగా అరిచింది.

నేను లేచాను.

"అదేమిటీ ... వెళ్తున్నావా?" అన్నాడు హెచ్.ఎం.

"వెళ్తున్నాను...!" అన్నాను.

హెచ్.ఎం. వెనుక పెద్ద భారతదేశపు పటం గోడకు అంటించి ఉంది. దానిమీద పురుగులు కొట్టేసినందువల్ల అనేక రంధ్రాలు అసహ్యంగా. బల్లమీద ఒక చిన్నసైజు గ్లోబు. అతను చిరునవ్వు నవ్వి, "వస్తూ ఉండు, అప్పుడప్పుడూ!" అన్నాడు.

"అట్లాగే!" అంటూ నేను బయటికి నడిచాను. విచిత్రంగా ఆకాశంలో మబ్బులు కమ్మి వెలుతురు మందగించింది. ■

